పేదలకు మేలు చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే శిల్పా రవి
- గుంతనాలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళ ప్రస్తావిస్తున్న సమస్యలను వింటున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్): పేదలకు మేలు చేయాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గుంతనాల, ఏ.శివరామపురం, బీ.శివ రామపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక నాయకులతో కలిసి నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజలందరికీ పారదర్శక పాలనను అందజేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. రైతులకు అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. గత ప్రభుత్వంలో నాయకులు రైతులను కేవలం ఓటర్లుగా మాత్రమే చూశారని, నేడు రైతుల అభివృద్ధే ధ్యేయంగా ఆర్బీకేలు నిర్మించి, రైతుల పక్షపాతిగా జగనన్న పనిచేస్తున్నారని వివరించారు. ఆయన బాటలోని తాము నడుస్తూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. మరింత మెరుగైన పాలన, పథకాల అమలు, సమస్యల పరిష్కారం కోసమే మీ ముందుకొచ్చామని సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గ్రామ సచివాలయాలను స్థాపించి, వాటికి అనుబంధంగా వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి అవినీతి, వివక్షకు తావు లేకుండా పాలనను అందిస్తూ సీఎం వైఎస్ జగన్ వివిధ రాష్ట్రాలకు మార్గదర్శకమయ్యారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీ కూడా నేరవేర్చకుండా, ప్రజలను మోసం చేశారని, మళ్లీ ఇప్పుడు వారిని వంచించేందుకు తప్పుడు హామీలు ఇస్తూ, ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు మాయమాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ రాష్ట్రంలో కనుమరుగు కావడం ఖాయమన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా వేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్, నంద్యాల మున్సిపల్ వైస్ చైర్మెన్ గంగిశెట్టి శ్రీధర్, సర్పంచ్ గాలి సరోజ, నాయకులు గాలి సురేంద్రరెడ్డి, రాజారెడ్డి, పుల్లారెడ్డి, వేణుగోపాల్, మహేశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చిత్ర కళ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్, ప్రశంసా పత్రాలు పొందిన చిన్నారులు

నంద్యాల(అర్బన్): తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలోని కోన సీమ చిత్రకళా పరిషత్ వారు ఈనెల 15న నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి బాలుర చిత్ర లేఖనం పోటీల్లో నంద్యాలకు చెందిన కోటేష్ ఆర్ట్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపి గోల్డ్ మెడల్స్ సాధించారని అకాడమీ నిర్వాహకులు కోటేష్ తెలిపారు. పతకాలు, ప్రశంసా పత్రాలు పొందిన చిన్నారులను బుధవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ పోటీలకు 21మంది చిన్నారులు వేసిన చిత్రాలను పంపగా.. భవతి, వాసంతి, సాయి హానీస్, సాహిత్, సాత్విక్, ఉమేష్ గుప్త, మంజునాథ్, హేమకేష్, నాగ శేషషయనారెడ్డి, నిఖిల్‌కు గోల్డ్ మెడల్, సర్టిఫికెట్లు, 11 మందికి మెరిట్ అవార్డ్స్ వచ్చాయని చెప్పారు. నిర్వాహకులు కొరియర్ దద్వారా పంపిన గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్నామని వివరించారు.

క్లుప్తంగా

బ్యాంక్ సేవలపై అవగాహన అవసరం



డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న ఏపీజీబీ అధికారులు

గోస్పాడు: పొదుపు మహిళలకు బ్యాంక్ సేవలపై అవగాహన కలిగి ఉండాలని ఏపీజీబీ బ్యాంక్ చైర్మన్ రాజేష్ అన్నారు. గోస్పాడు ఏపీజీబీ శాఖ కార్యాలయం లో బుధవారం బ్యాంక్ సేవలపై పొదుపు మహిళలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొదుపు మహిళలు తమ సంఘాలను సక్రమంగా నిర్వహించుకోవడంతో పాటు పొదుపును జమ చేసుకోవాలని, రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. సేవలు, పొదుపు రుణాల మంజూరుపై, పొదుపు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. బ్యాంక్ డిపాజిట్, బ్యాంక్ సేవల విస్తరణపై అవగాహన కల్పించారు. రీజినల్ మేనేజర్ నవీన్‌కుమార్, డీఆర్డీఏ జిల్లా డీపీఏం దానం, బ్యాంక్ మేనేజర్ దస్తగిరి, వెలుగు ఏపీఎం ప్రసాద్, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలి

దొర్నిపాడు: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని గుండుపాపలలోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. శనగనలో ఎండుతెగులును గమనించిన అయన నివారణకు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ట్రైకోడెర్మా 10 గ్రాములతో పాటు కార్బండిజం 2.50 గ్రాములు లేదా టెబుకొనజోల్ 1.5మి.లీను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వీఏఏ గురుగోవర్ధన్ పాల్గొన్నారు.

పట్టణంలో పచ్చదనం పెంపొందిస్తాం

నంద్యాల(సిటీ): పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, ముఖ్యంగా పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఉద్యానవన శాఖ అధికారి నాగరాజుతో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో సుమారుగా 12 కి..మీ. మేర మొక్కలు నాటనున్నమన్నారు. డివైడర్ల మధ్యలో 6 కి.మీ.లో మొక్కలు, మరో 6 కి.మీ. మేర అవెన్యూ ప్లాంటేషన్ ఉంటుందని చెప్పారు. అలాగే పార్కులను ఆధునీకరించడం ద్వారా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నామన్నారు. ఇప్పటికే సచివాలయ సిబ్బంది మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించారని, త్వరలోనే మొక్కలు నాటుతామన్నారు. మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, డీఈఈలు మధుకుమార్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించండి

రుద్రవరం: ప్రతి ఉద్యోగి తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. స్థానిక 1,2,3 గ్రామ సచివాలయాలను బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమయ పాలన పాటించేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు.అలాగే ప్రతి వలంటీర్ వారంలో మూడు సార్లు బయోమెట్రిక్ హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం మెరుగు,ఇంటి పన్ను వసూళ్లు వంటివి చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు మహమ్మద్ రఫి, నాయక్ తదితరులు ఉన్నారు.

నరసింహయ్య ఆశయ సాధనకు కృషి చేద్దాం

నంద్యాల(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లా సీపీఎం ఉద్యమ నిర్మాత నరసింహయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. స్థానిక నరసింహయ్య భవన్‌లో బుధవారం నరసింహయ్య నాల్గవ వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా నరసింహయ్య చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యమంలో నరసింహయ్య చెరగని ముద్ర వేశారని కొనియాడారు. నాయకులు లక్ష్మణ్, తోట మద్దులు, పుల్లా నరసింహులు, గౌస్, బాలవెంకట్, సుబ్బారావు, శివ పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయింపు

రుద్రవరం: మండలంలోని ఎల్లావత్తులలో దళితుల శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించినట్లు తహసీల్దార్ వెంకటశివ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా గ్రామ సమీపంలో 106 సర్వే నంబరులో కొంత ప్రభుత్వ భూమి ఖాళీగా ఉందన్నారు. బుధవారం ఆ భూమిని పరిశీలించి శ్మశానవాటికకు కేటాయించామని చెప్పారు. వెంటనే కొలతలు వేసి హద్దు రాళ్లు పాతించి స్థలాన్ని వారికి అప్పగించాలని వీర్వోలను ఆదేశించామన్నారు. వీఆర్వోలు నారాయణ ,మల్లేశ్వరప్ప ఉన్నారు.

కేఆర్ఎంబీ కర్నూలులో ఏర్పాటు చేయాలి



దీక్ష చేస్తున్న రైతు సంఘాల నాయకులు

నంద్యాల(అర్బన్): శ్రీశైలం ప్రాజెక్టు ఉన్న కర్నూలులోనే కృష్ణా నది యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. కేఆర్ఎంబీని కర్నూలులోనే ఏర్పాటు చేయాలంటూ బుధవారం రైతు సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట రాయలసీమ ధర్మదీక్ష చేపట్టారు. సమితి ఉపాధ్యక్షుడు వైఎస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన దీక్షలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల నీటి వినియోగం, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైనది శ్రీశైలం రిజర్వాయర్ అన్నారు. కృష్ణా జలాల నిర్వహణ, వినియోగంపై పర్యవేక్షణకు శ్రీశైలం రిజర్వాయర్ అత్యంత కీలకమైందన్నారు. కేఆర్ఎంబీని కర్నూలులోనే ఏర్పాటు చేస్తే సీమ రైతాంగానికి సాగునీటి లభ్యతలో న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కర్నూలు చంద్రశేఖర్‌రెడ్డి, కోటిరెడ్డి, వేణుగోపాలరావు, రామకృష్ణారెడ్డి, రమణ, హరినాథరెడ్డి, నాగన్న, అరుణ్, పాని, మల్లికార్జున, రవి, మధుసూదన్‌రెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- పట్టణంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



పథకాల గురించి మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ఇంతకుముందెన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను అవినీతికి అవకాశం లేకుండా పారదర్శకంగా , లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని ఐదవ వార్డు సచివాలయ పరిధిలోని ఏడో వార్డులోని ఏసునాథపురం, టీబీ రోడ్డు, ఎస్వీ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన గడచిన మూడేన్నరేళ్లలో అమలు చేసిన పథకాలను గడప గడపకు తిరిగి లబ్ధిదారులకు వివరించి బుక్‌లెట్ అందజేశారు. ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేసిన ఘనత జగనన్నదేన్నారు.పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరును చూసి ప్రతి పక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయని ఎద్దేవా చేశారు. గతంలో జన్మభూమి కమిటీలు సిఫారసు చేసిన వారికే ప్రభుత్వ పథకాలు అందేవని, ప్రస్తుతం పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలను ఇళ్ల వద్దకే వలంటీర్ల ద్వారా చేరుస్తున్నామని చెప్పారు. టీడీపీ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి పథకాలను తీసుకోవాల్సిన దుస్థితి నుంచి గడప వద్దకే అందజేసి స్థితి పాలనను జగనన్న తీసుకొచ్చారని వివరించారు. వివిధ కార్యాలయాల నిర్మాణంతో గ్రామాలు శాశ్వత అభివృద్ధికి చిరునామాలుగా చరిత్రలో నిలిచిపోనున్నాయన్నారు. ప్రజల ప్రభుత్వం ఏమి చేసింది, సంక్షేమ పథకాల ద్వారా ఎంత లబ్ధి పొందింది స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, బాలబీ్బ, చక్రపాణి, నాయకులు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సేవలను వినియోగించుకోండి

నంద్యాల(సిటీ): మొబైల్ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పలు వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు అందిస్తున్నామన్నారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, అప్డేషన్, బయోమెట్రిక్ అప్డేషన్ లాంటి సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వార్డు సచివాలయ అడ్మినిస్ట్రేటివ్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, మహిళా సెక్రటరీలు, రెవెన్యూ సెక్రటరీలతో పాటు వలంటీర్లు పాల్గొని ప్రజలు, విద్యార్థులు సేవలను ఉపయోగించుకునేలా చూడాలని ఆదేశించారు.

తేదీల వారీగా మొబైల్ ఆధార్ సేవలందించే వార్డుల వివరాలు..

తేదీ	సచివాలయ స్థలం
19	జగజ్జననీ నగర్, సాయిబాబా నగర్-2, విశ్వనగర్, నందమూరి నగర్
20	జగజ్జనని నగర్, పొట్టి శ్రీరాములు పాఠశాల నూనెపల్లె,సాయిబాబా నగర్-2, నందమూరినగర్
21	పానిపట్టి, ఎంపీయూపీ స్కూల్ ఏకలవ్యనగర్, సాదిక్ నగర్,సలీం నగర్-1
23	నడిగడ్డ-2, టాగూర్ ఎంపీయూపీ పాఠశాల ఏకలవ్యనగర్, సాదిక్ నగర్, రామ్‌నాథ్‌రెడ్డి నగర్
24	నడిగడ్డ-2, నూనెపల్లె హరిజనవాడ, విజయపురి కాలనీ, రామ్‌నాథ్‌రెడ్డి నగర్

తండాల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

నంద్యాల(అర్బన్): జిల్లాలోని గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ కోరారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆయన జిల్లా కలెక్టర్‌ను కలిశారు. అనంతరం గిరిజన తండాల్లో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. గిరిజనుల ఆచార వ్యవహారాలతో పాటు గ్రామాల్లో మౌలిక వసతులు, తాగునీరు తదితర సమస్యలను సత్వరమే పరిష్కరించాలని విన్నవించారు. జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ ఉన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

నంద్యాల(సిటీ): క్రీడల్లో గెలుపు ఓటములు సమానమని, ఓడిపోయిన జట్టు కృంగి పోకుండా గెలుపే లక్ష్యంగా ముందుకు సాగితే విజయం వరిస్తుందని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. స్థానిక ఎస్పీజీ కళాశాల క్రీడామైదానంలో బుధవారం రాష్ట్ర స్థాయి శాప్ ఫుట్‌బాల్ లీగ్ ఫేజ్-2 పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉన్నత క్రీడాకారులుగా మారేలా శ్రమించాలని కోరారు. అనంతరం స్టేట్ కన్వీనర్, శాప్ ఫుట్‌బాల్ లీగ్ సీనియర్ శిక్షకుడు సిరాజుద్దీన్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో మొదటిసారి ఫుట్‌బాల్ లీగ్ జరగడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు రాజు, ఎస్పీజీ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్, జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, పీడీలు పాల్ విజయ్‌కుమార్, ఏనుగుమర్రి పాల్గొన్నారు.

శ్రీశైలంలో పార్కింగ్ ప్రదేశాల పరిశీలన



పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న దేవస్థానం ఈఓ, అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 11 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా క్షేత్ర పరిధిలోని వివిధ ప్రదేశాల్లో పార్కింగ్ ప్రదేశాలను దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎస్ లవన్న పరిశీలించారు. బుధవారం స్థానిక పోలీస్, దేవస్థాన అధికారులతో కలిసి యజ్ఞవాటిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఘంటామఠం వెనుక భాగం, దేవస్థాన ఆగమపాఠశాల ఎదురుగా ఉన్న ఆరుబయలు ప్రదేశం, ఆర్టీసీ బస్టాండ్, వాసవీ విహార్ తదితర ప్రదేశాలను సందర్శించారు. ఈఓ మాట్లాడుతూ పార్కింగ్ ప్రదేశాలలో గ్రావెల్ చదును పనులు వేగవంతం చేయాలని సూచించారు. అవసరం అయిన చోట్ల జంగిల్ క్లియరెన్స్ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలన్నీ శుభ్రంగా ఉండేందుకు అవసరం అయిన చర్యలు చేపట్టాలని పారిశుధ్య విభాగాన్ని ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలలో మంచినీటి సదుపాయం, శౌచాలయాలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. అనంతరం గణేష్ సదనం పనులను పరిశీలించారు. ఆయన వెంట ఈఈ రామకృష్ణ, ఏఈఓ ఫణిధర్, డీఈఈ నరసింహారెడ్డి, పర్యవేక్షకులు అయ్యన్న, ఉద్యాన వన అధికారి లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటలో పెరిగిన ఆదాయం

గడివేముల: మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీదుర్గాభోగేశ్వర క్షేత్రంలో వివిధ దుకాణాల నిర్వహణకు బుధవారం నిర్వహించిన వేలంపాటలో ఆదాయం పెరిగినట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కళింగిరి పండ్లు అమ్ముకునేందుకు గతేడాది రూ.8800 ఉండగా ప్రస్తుతం రూ.10,500కు వేలంలో ఆదాయం వచ్చిందన్నారు. అలాగే చెరుకు అంగడి నిర్వహణకు గతంలో రూ.21,000 పోగా కొత్తగా రూ.27,000, ఐస్ కూల్‌డ్రింక్స్ అంగడి నిర్వాహణకు గతంలో రూ.26,000 ఉండగా రూ.29,500కు పాటదారులు దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈ సంవత్సరం వేలాల్లో రూ.66,200 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి రవి కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్చకులు శ్యాంసుందర్ శర్మ పాల్గొన్నారు.

బైక్ చోరీ

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో బుధవారం మోటార్ సైకిల్ చోరీకి గురైందని ఎస్ఐ తిరుపాల్ తెలిపారు. నంద్యాలకు చెందిన హుసేని పనుల నిమిత్తం బంధువుల ఇంటికి బైక్‌పై వచ్చాడు. తిరిగి నంద్యాలకు వెళ్లేందుకు ఇంట్లో నుంచి బయటకి రాగా పార్కింగ్ చేసిన బైకు కనిపించలేదు. చుట్టుపక్కల వారిని విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని వైఎస్సార్ నగర్ బుడగజంగం కాలనీలో నిర్మాణ దశలో ఉన్న శ్రీ జంబులా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి స్థానిక నాయకుడు తాటికొండ బుగ్గ రాముడు రూ.50వేలు విరాళంగా బుధవారం అందజేశాడు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ బాబురావు, ఆలయ కమిటీ సభ్యులు సుంకన్న, ఎల్లప్ప, మౌలాలి, పెద్ద స్వామి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

గోస్పాడు: వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలని వైద్యాధికారి కాంతరావు నాయక్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందజేయాలని చెప్పారు. చూడాలన్నారు. ఆనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో వారికి వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఎస్సార్‌బీసీ కాలనీలోనున్న హైచ్ఐవీ బాధిత చిన్నారులకు రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి బుధవారం రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ లోకం తెలియని చిన్నారులు హెచ్ఐవీకి గురి కావడం తనను కలిచి వేసిందన్నారు. ప్రతి నెలా చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించి, వారి జీవిత ప్రమాణాన్ని పెంచడమే కాకుండా బలవర్ధకమైన ఆహారం ఇప్పించేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాసులు, రమేష్, ప్రిన్సిపాల్ సుబ్బయ్య, జగదీష్ ఆచారి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.4.90 లక్షలు

ఓర్వకల్లు: కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపులో రూ.4.90 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ తెలిపారు. బుధవారం దేవదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ రఘురామ్, ఆలయ చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. గడిచిన ఆరు నెలలకు సంబంధించి భక్తులు నగదు రూపంలో సమర్పించిన కానుకలను లెక్కించినట్లు ఈఓ తెలిపారు. ఈ మేరకు మొత్తం రూ.4,90,107లు వచ్చినట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కళ్లె లక్ష్మీనారాయణశర్మ పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రా రెడ్డి విస్తృత ప్రచారం



పీఆర్‌టీయూ కార్యాలయంలో మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

నంద్యాల(అర్బన్): తొలి ప్రాధాన్యత ఓటు తనకే వేసి గెలిపించాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి కోరారు. బుధవారం ఆయన పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేయాలంటూ గ్రాడ్యుయేట్లను అభ్యర్థించారు. పీఆర్‌టీయూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రవీంద్రారెడ్డి మాట్లాడుతూ పట్టణ భద్రుల ఎమ్మెల్సీ ఓటు తిరస్కరణకు గురైతే మళ్లీ ఈ నెలాఖరు వరకు నమోదు చేసుకోవచ్చని సూచించారు. పట్టభద్రులందరూ వైఎస్సార్‌సీపీ బలపరిచిన తనకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కుమారస్వామిరెడ్డి, కౌన్సిలర్లు తమీమ్, అన్సారి నౌమాన్, సోమశేఖర్‌రెడ్డి, సాయిరాంరెడ్డి, రహంతుల్లా, పార్థసారథి, కృష్ణమోహన్, చంద్రశేఖర్, అమృతరాజు, ఎద్దురవి, జాకీర్‌హుసేన్, భాస్కరరెడ్డి, మజీద్, జయప్రకాష్ నారాయణ, రామచంద్రుడు, భాస్కర్, రమేష్ పాల్గొన్నారు.

నాణ్యతగా సీసీ రోడ్లు



ఎర్రగుడిదిన్నెలో సీసీరోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

రుద్రవరం: మండలంలోని వివిధ గ్రామాల్లో వేసిన సీసీ రోడ్లు నాణ్యతగా ఉన్నాయని క్వాలిటీ కంట్రోల్ డీఈఈ మోహన్‌రావు తెలిపారు. మండలంలోని ఎర్రగుడిదిన్నెలో సీఎండీఎఫ్ నిధులు రూ.5.70 లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో చిలుకలూరులో, రూ.5లక్షలతో నల్లవాగుపల్లెలో నూతనంగా వేసిన సీసీ రోడ్లను బుధవారం ఆయన నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పీఆర్ డీఈఈ నరసింహులు,ఏఈ వెంకటరాముడు ఉన్నారు.

బోట్లలో ప్రయాణం చేయకుండా చూడాలి



సంగమేశ్వరం ఘాట్ వద్ద ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్

కొత్తపల్లి: సింగోటం రథోత్సవం సందర్భంగా మండలం నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు బోట్లపై కృష్ణా నది దాటేందుకు ప్రయత్నిస్తారని, ఎవరు కూడా బోటు ప్రయాణం చేయకుండా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది జాగ్రత్తగా బందోబస్తు విధులు నిర్వర్తించాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. బుధవారం సంగమేశ్వరం, సిద్ధేశ్వరం, జానాలగూడెం ఘాట్లను తనిఖీ చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించేందుకు ప్రయత్నిస్తే సమాచారం ఇవ్వాలని, వారిపై కేసులు నమోదు చేసి బోట్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా పాతమాడుగుల గ్రామంలో కూడా బోటుపై ప్రయాణం చేస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో సింగోటం జాతరకు వెళ్లిన వారి గురించి ఆరా తీశారు. అందరూ ఆర్టీసీ బస్సుల్లోనే వెళ్లారని గ్రామస్తులు తహసీల్దార్‌కు తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శేషారామ్‌సింగ్, కానిస్టేబుల్ సుదర్శన్, వీఆర్వోలు రహిమాన్, అశోక్ ఉన్నారు.

బస్సులో సింగోటం బయలు దేరిన భక్తులు

పగిడ్యాల : తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా సింగోటం గ్రామంలో జరిగే లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవ వేడుకలకు భక్తులు బుధవారం ఆర్టీసీ బస్సుల్లో బయలుదేరారు. గతంలో కృష్ణానదిలో ఇంజిన్‌బోట్లలో భక్తులు తరలివెళ్లేవారు. అయితే బోటు ప్రయాణంపై నిషేధం విధించడం వల్ల భక్తులు ఆర్టీసీ బస్సుల్లో బయలుదేరారు. నందికొట్కూరు డిపో నుంచి సింగోటం జాతరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. అర్లపాడు, మూర్వకొండ ఘాట్లవద్ద ఇంజిన్ బోట్లు తిప్పకుండా ముచ్చుమర్రి ఎస్ఐ, రెవెన్యూ అధికారులు బందోబస్తు కొనసాగిస్తున్నారు. బందోబస్తును తహసీల్దార్ భారతి పర్యవేక్షించారు.

అర్హులందరికీ ఉపాధి పనులు కల్పిస్తాం

మహానంది: గ్రామాల్లో అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీడీ బాలాజీ నాయక్ తెలిపారు. తిమ్మాపురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా పనులు చేయించనున్నట్లు తెలిపారు. పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మనోహర్, సిబ్బంది వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పనకు చర్యలు

బండిఆత్మకూరు: ఉపాధి హామీ పథకం ద్వారా జాబు కార్డు ఉన్న కూలీలందరికి పనులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఓ వసుధ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిఐ పనులపై సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ఏ గ్రామంలో ఏఏ పనులు చేపట్టాలో సర్వే నిర్వహించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో తీర్మానాలు చేసి పనులు మంజూరయ్యేలా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవ గుప్తా పాల్గొన్నారు.